
# నీ మొగుడు ఏం చేస్తాడు

**వేదుల సత్యనారాయణ**





'కీచు'మని శబ్దం చేస్తూ ఆగింది లారీ. డ్రైవరు రావుడు 'స్టీరింగ్'ను వదిలి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని ప్రక్కకి చూశాడు.

ఆ క్యాబిన్‌లో మూలగా ముడుచుకుని కూర్చుని క్లీనరు కిట్టయ్య కునికి పాట్లు పడుతున్నాడు.

"రేయ్ కిట్టిగా లేరా" కిట్టిగాడ్ని తడుతూ లేపాడు.

ఉలికిపాటుగా లేచి కూర్చుని "అపుడే వైజాగ్ వచ్చేసిందా గురూ!" అడిగాడు ఆశ్చర్యంగా.

"అది తెల్లారితే గానీ రాదు. లే భోజనం చేద్దాం. ఆకలి దంచేస్తోంది కడుపులో?"

కిట్టయ్య ఒక్క ఉదుటున లారీ క్యాబిన్ నుండి కిందికి దూకి, బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని, ఆవులిస్తూ రావుడు వెనుక నడవసాగాడు.

అర్ధరాత్రి. కొంచెం దూరంలో రెండు మూడు లారీలు ఆగి ఉన్నాయి. దగ్గర్లోనే ఉన్న ఇరానీ హోటల్లో కడుగు పెట్టారు ఇద్దరూ.

పావు గంటలో భోజనం చేసి బయటపడ్డారు.

"ఇక ఈ పూట ప్రయాణం వద్దు గురు. రేపు పొద్దుగేల బయల్దేరుదాం. నాకు నిద్రాగడం లేదు" ఒక చేత్తో నిండిన కడుపు రాస్తూ, ఆవులిస్తూ మగతగా అన్నాడు కిట్టిగాడు.

కిట్టిగాడు నిద్రకి నిలవలేక గబ గబా అడుగులేస్తూ లారీ చేరాడు.

కిళ్లీ కట్టించుకుని, నోట్లో వేసుకుంటూ రెండడుగులు వేసిన రావుడికి ఉన్నట్టుండి ఒక్కసారిగా హృదయాన్ని జలదరింప చేస్తూ గాజుల శబ్దం వెనుక వైపు నుంచి వినపడ్డది.

సిగరెట్ ముట్టించుకోబోతున్న వాడల్లా ఆగి, వెనక్కి తిరిగి చూశాడు.

కిళ్లీ షాపు ప్రక్కగా, చీకటి నీడలో ఉన్న ఒక యువతి చేత్తో రమ్మన్నట్టుగా సైగ చేసింది.

ఒక్క క్షణం అయోమయంగా అటూ ఇటూ తిరిగి చూసి, ఆమె పిలిచేది తననేనని గుర్తించి అటువైపు అడుగులు వేశాడు.

ఆమె దరిచేరగానే పౌడరు, మల్లెల సువాసనలు కలిసిన సరిక్రొత్త మత్తు గొలిపే పరిమళం అతడిని చుట్టుముట్టింది!

ఆమెకు దగ్గిరగా నిలబడ్డ అతనికి ఆమె రూపం, ఆకారం స్పష్టంగా కనిపిస్తోందా మసక వెలుతుర్లో.

బొడ్డు క్రిందుగా, నడుము అంచుల్ని తాకుతూ జీరాడుతున్న పలుచని తెల్లని పాలిస్టర్ చీర, పమిట చెదరడంతో ఒక ప్రక్క నుంచి పూర్తిగా బయటికి ఉబికి కనపడుతున్న నిండైన యవ్వనం చక్కని ముక్కు తీరు....!

రావుడికి అర్థమయింది ఆమె తనని ఎందుకు పిలిచిందో. ఇట్లాంటి వ్యవహారాలు అతడికి మామూలే కాబట్టి.

ఆమెని ఎగాదిగా చూస్తూ

అడిగాడు. "ఎంత?"

ఆమె చెప్పింది.

గత వారం పది రోజులుగా లారీతో నే వూర్లు తిరుగుతున్నాడు. అతడికి ఆడదాని అవసరాన్ని యీ దృశ్యం మరింత ఎక్కువ చేసింది.

"అయితే పద..." రావుడు వెనక్కి తిరిగాడు.

"బండిలో వద్దు. ఇంటి కెళదాం. దగ్గరే...." గబ గబా చెప్పిందామె.

'ఈ వ్యవహారానికి క్రొత్తయి ఉంటుంది. అందుకే ఇంటికి రమ్మంటోంది. అయితే కొత్త సరుకు అన్న మాట' అతడి మనస్సు ఉత్సాహంతో ఉరకలేసింది.

"అయితే ఉండు. మా వాడికి చెప్పేసి వస్తా" ముందుకి కదిలాడు.

ఆమె అక్కడ్నుంచి కదిలి రోడ్డు పైకెళ్ళి ప్రక్కగా నిలబడింది.

రెండు నిముషాల్లో ఆమెని సమీపించాడు రావుడు.

అతడు తన దరి చేరగానే ముందుకి కదిలింది ఆమె. సిగరెట్ అంటించి గుండె నిండా గాలి పీల్చి వదుల్తూ ఆమె వెంట నడవసాగాడు.

సందు మలుపులో చీకట్లో అతడు తపనగా ఆమె దగ్గరగా వెళ్ళి, నడుము పైకి చేయి పోనిచ్చి, దగ్గరగా లాక్కొన్నాడు.

క్షణంలో తేరుకుని "ఉహుఁ ఇక్కడ కాదని చెప్పాగా..." విడిపించుకుని దూరంగా జరిగింది.

"ఇంకా ఎంత దూరం?" రావుడిలో అసహనం.

"వచ్చేసాం... ఇదిగో ఇదే" తలుపు గొళ్ళెం తీసి లోపలికి వెళ్ళింది.

అది ఒక చిన్న గుడిసె. లోపల లాంతరు మసక కాంతిని ప్రసరింప చేస్తోంది. సిగరెట్ కింద పడేసి లోపలి కడుగు పెట్టాడు.

ఆమె వెళ్ళి లాంతరు దీపాన్ని కొద్దిగా పెంచింది.

తలుపు దగ్గరిగా వేసి ఒక్క ఉదుటున ఆమెని వెనుక వైపుగా గాఢంగా కౌగిలించుకున్నాడు రావుడు.

అతడి చేతి వేళ్ళు ఆమె ఎత్తైన గుండెల పైకి వెళ్ళాయి. చేతికి ఏదో చల్లగా తగిలింది, బయటికి తీసి చూశాడు. మంగళ సూత్రాలు.

"నీకు పెళ్ళైందా?!" అడిగాడు.

"ఊఁ" తలూపింది.

"అయితే– మరి నీ భర్త...." చీర విప్పి – ఓ మూలకి విసిరేస్తూ అడిగాడు.

"లారీ తోలు కెళ్ళాడు."

ఉలిక్కిపడ్డాడతను. "అంటే లారీ డ్రైవరా?!" మత్తు దిగగా అడిగాడు.

అతడి చేతులు ఠక్కున ఆగిపోయాయి... బహుశా ఆమె భర్త వృత్తి, తన వృత్తి ఒకటే అయినందు వల్లనేమో? లేక తోటి డ్రైవర్ భార్యని చెల్లెలిగా భావించాలన్న తమ యూనియన్ నియమం వల్లనేమో?!

స్తబ్బుగా ఉండిపోయాడు.

ఇంతలో మూల నుంచి పసిపాప ఏడుపు వినిపించింది ఉన్నట్లుండి.

ఆమె ఒక్క ఉదుటున ఆ వైపుకు వెళ్ళి, మూలగా మంచం పైనుంచి క్రిందుగా వ్రేలాడ గట్టిన గుడ్డను తొలిగించి. క్రింద నేలపై, బొంతలో పడుకో బెట్టిన తన బిడ్డని చేతుల్లోకి తీసుకుంది.

ఆ పిల్ల ఏడుపుకి తేరుకున్న రావుడు ఆమె వైపు చూశాడు.

ఆమె అర్ధనగ్నంగా మంచంపై కూర్చుని జాకెట్టు కొద్దిగా పదులు చేసి రొమ్మని ఆ పసివాడి నోటికి అందించింది.

ఠక్కున నోరు మూసాడు పసివాడు.

పిల్ల తల్లి అని తెలిస్తే ఎవరూ రారని, వచ్చినా చూసి వెళ్ళిపోతారని అలా మంచం క్రింద, గుడ్డని తెరగా కట్టి ఆ పిల్లవాడ్ని పడుకోబెట్టిందని అనుకోగానే అతడికి కోపం వచ్చింది.

"సంపాదించే మొగుడుండగా ఈ ఎదవ పనులెందుకు సెయ్యడం..." అన్నాడు.

ఆమె రోషంగా తల పైకెగరేసి రావుడి వైపు చూసింది. మనస్సు చివుక్కుమనగా గుండెల్లో ఆవేశం పైకెగసింది ఆమెకి.

నెమ్మదిగా, బాధగా చెప్పింది.

"సంపాదన ముఖ్యం కాదు. పెళ్ళాం పిల్లలకి ఎంత ఖర్చు పెడుతున్నాడన్నది ముఖ్యం. నా ఒళ్ళు ఊరికినే బలిసిపోవడానికి నా మొగుడు నాకు ఇంత తిండి పెడతేగా?"

అర్థం గానట్లు అయోమయంగా చూశాడామె వైపు రావుడు.

"సంపాదనంతా తన తాగుడికి, తనకి రోజుకో సుఖం కోసం అంతా తగలెట్టి, ఇంటి దగ్గర పెళ్ళాన్ని కన్నీళ్ళతో కడుపు నింపుకోమని గాలి కొదిలేసి తనిష్టం వచ్చినట్లు తిరిగే నా భర్త గురించి నీకేం తెలుసు! ఈ పసివాడికి పాలు కావాలి. తల్లి పాలు మానేసే వయస్సింకా రాని వీడికి నేను పాలివ్వాలంటే శరీరంలో తిండి లేకపోతే అవి ఎక్కడ్నుంచి వస్తాయ్. అందుకే ఇలా.... ఆ వచ్చే డబ్బుతో ఇద్దరి కడుపులు నిండుతున్నాయ్..." ఆమె కళ్ళల్లో సన్నని నీటి పొర.

మనస్సులో గూడుకట్టుకున్న ఆవేశం రావుడి మాటలతో బయటకు తన్నుకొచ్చాయి.

రావుడుకి ఎవరో వీపుపై ఛళ్ళున చరిచినట్లయింది. కారణం చిన్నదే. అతనూ డ్రైవరే. అతడు తాగుతాడు. వ్యభిచారం సరేసరి. ఎపుడో ఒకోసారి, అదీ బుద్ధి పుడితే, పెళ్ళాం పక్కలో చేరినపుడే అంతో ఇంతో ఇచ్చేవాడు. పూర్తిగా మాత్రం జీతం భార్య చేతికిచ్చేవాడు కాదు. పైగా తనకి ఇద్దరు పిల్లలు.

కొన్నాళ్ళు పోతే... ఇలాగే తన ప్రవర్తన కొనసాగితే... రేపు తన భార్య కూడా రోడ్డున పడి..... ఛ... ఛ... ఊహించుకో లేకపోయాడు.

కళ్ళ ముందు దృశ్యాల్ని తొలగించుకోడానికి తల విదిల్చేడు. మత్తు పూర్తిగా దిగినట్లయింది రావుడికి.

ఆమె పిల్లవాడిని పడుకోబెట్టి, రావుడి దగ్గరగా వచ్చి "క్షమించు పిల్లాడు ఏడుస్తుంటే తల్లి ప్రాణం ఊర్కోలేకపోయింది...." భుజంపై చెయ్యి వేసింది.

"వద్దు... వద్దు.." దూరం జరిగాడు రావుడు.

అర్థంగాక ఆశ్చర్యంగా చూసిందతని వైపు.

"ఇంద ఈ వందుంచుకో. కాదనకు, నీకు తోడబుట్టిన వాడ్ననుకో. నా కళ్ళు తెరిపించావ్. నేను నీ భర్తలాగా అన్ని వ్యసనాలు కలవాడినే. అయితే నా భార్య భవిష్యత్‌లో.... ఉహూఁ... వస్తా..." ఆమె చేతిలో వంద పెట్టి, ఒక్క ఉదుటన బయటపడ్డాడు రావుడు.

ఆమెకు పరిస్థితి అర్థం అయి, కానట్లుగా ఉంది. చేతిలో రెపరెపలాడుతున్న పచ్చనోటు వంక చూస్తుండి పోయింది.

అందుకే అంటారు 'ఎదుటి వారి జీవితం మనకి అనుభవం కావాలని.' ●

## కోరిక తీరని రాఖీ



పాకిస్తాన్ వెళ్ళి శ్రీమతి బెనజీర్ భుట్టోను కులుసుకోవాలనుకున్న రాఖీ కోరిక నెరవేరలేదుట పాపం! ఒక వికలాంగుల సంస్థ ప్రారంభోత్సవానికి అక్కడి సంఘ సేవా సంస్థ ఒకటి రాఖీని ఆహ్వానించిందట. తను యిష్టపడే బెనజీర్ భుట్టోను కలుసుకునేందుకు అనుమతి యిచ్చేట్లయితేనే వస్తానని షరతు పెట్టటంతో ఆ సంస్థ ఎట్టకేలకు అనుమతి సంపాదించిందట. కాని దురదృష్టం ఆమె కంటే రెండడుగులు ముందే వున్నదేమో.... గాయం తగిలి మంచమెక్కటంతో రాఖీకి పాకిస్తాన్ పర్యటనావకాశం చేజారిపోయింది.

చిత్ర రంగంలో రాణిస్తూనే వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న షబ్నా అజ్మీ, వైజయంతిమాల వంటి నటీమణులుండగా ఆ సంఘ సేవా సంస్థ ఈ రాఖీనే ఎందుకు ఆహ్వానించిందో అర్థం కాక జుట్టు పీక్కుంటున్నారు పరిశ్రమలోని వాళ్ళు. బహుశా ఈమె అందం ఆకర్షించిందేమో మరి!